నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శనివారం | అక్టోబర్ 07, 2023 | www.navatelangana.com

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ముధోల్ ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాలలో రూ.5కోట్లతో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని వర్గాల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నాడని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ శ్రద్ధతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ రాజేందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపిటిసి భూమేష్, మండల కో ఆప్షన్ సభ్యులు ఖాలీద్, ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ

సారంగాపూర్ : మండలంలోని వంజర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం ఎఎంసి చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గోనె లక్ష్మణ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నూతన భవనం త్వరగా పూర్తిచేసి గ్రామానికి అందించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ హరీష్, అడెల్లి డైరెక్టర్ సత్యపాల్‌రెడ్డి, వార్డ్ మెంబర్లు గోని జ్యోతి గంగాధర్, నవీన్ యాదవ్, కునుకుట్ల లక్ష్మీ లక్ష్మారెడ్డి, అశోక్, మహేష్ యాదవ్, గంగారెడ్డి, ఆర్ఎంపి రమేష్, సిహెచ్ మహేష్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, కారోబార్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే, డ్రై డే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రాంనగర్ కాలనీలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ కేసు నమోదైన ఇంటికి వెళ్లి దోమల మందు పిచికారి చేయించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జ్వరం బారిన పడితే వెంటే వైద్యాధికారులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. అజాగ్రత్తగా ఉండకూడదని సూచించారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన



నవతెలంగాణ-తలమడుగు

3మండలలాకు చెందిన 94 గ్రామపంచాయతీలకు నీటి సరఫరాను అందించే మిషన్ భగీరథ సంపు పనులను సుంకిడి గ్రామంలో జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి పరిశీలించారు. మిషన్ భగీరథ సంపు కొరకు కొత్తగా కరెంటు స్తంభాలను అమర్చే ఇబ్బందులను పరిశీలించారు. గ్రిడ్ గోపీచంద్, విద్యుత్ ఏఈ సతీష్‌తోపాటు సంబంధిత శాఖ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. కరెంటులో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, 94 గ్రామపంచాయతీలకు త్వరగా నీటి సరఫరా అందించాలని సంబంధిత శాఖ అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా మహేందర్, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్‌రావు, లింగన్న, అశోక్, మిషన్ భగీరథ ఏఈ మహేష్ ఉన్నారు.

అనుమతి లేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ప్రయివేటు ల్యాబ్‌లను నడినిస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగిపోతున్న వేళ వాటిని ఆసరా చేసుకుని పేద, గిరిజనుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌లు నడుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని యెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ నుండి 42 మందికి కొలువులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన పోలీస్ ఫలితాలలో ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ నుండి 42 మంది వివిధ కేటగిరీలలో ఉద్యోగాలు సాధించారని ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదడవం, అధ్యాపకులు అత్యుత్తమంగా బోధించడం ద్వారా ఈ రికార్డుస్థాయి ఫలితాలను పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ సిబ్బందికి, అలాగే కొలువులు సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో అభ్యర్థులు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

కలుషిత నీరు తాగొద్దు

బజార్‌హత్నూర్ : మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలు కలుషిత నీరు తాగవద్దని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ భీంరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్లయ్యపల్లె గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటు కలుషిత నీరు తాగకుండా చూసుకోవాలన్నారు. తాగే నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. బోరు బావుల వద్ద నీరు నిల్వ ఉండకుండా క్లోరినేషన్ చేయించుకొని నీటిని వాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ దేవిదాస్, హెల్త్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీలో బెల్లంపల్లి సిఓఈ విద్యార్థికి ఉద్యోగం



తాండూర్ : బెల్లంపల్లి సిఓఈ విద్యార్థి తాళ్ల పవన్‌కళ్యాణ్ ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. ఏప్రిల్ 17న రాత పరీక్షకు హాజరైన పవన్‌కళ్యాణ్ ప్రతిభ చూపి ఫిజికల్, మెడికల్ టెస్టుకు ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 3న ఫిజికల్ టెస్టులలో భాగంగా జరిగిన ఈవెంట్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి తుది పరీక్ష ఫలితాల్లో సోల్జర్‌గా ఉద్యోగం సాధించి బెల్లంపల్లి సత్తా చాటాడు. ఈ సందర్భంగా శుక్రవారం సిఓఈ ఆవరణలో పవన్ కల్యాణ్‌ను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ప్రిన్సిపాల్ ఐనాల సైదులతో కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పుదారి నగేష్, పెరుగు తిరుపతి, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగొట్టి రాకేష్, డి.రాజలింగు, కె.భాస్కర్, సివిల్ కాంట్రాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్..!

- పార్టీకి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ రాజీనామా
- స్నేహితుడి టికెట్ కోసం తన గొంతు కోశారని వ్యాఖ్య
- ఏ పార్టీలో చేరేది త్వరలోనే నిర్ణయం
- ఇప్పటికే అసంతృప్తితో ఉన్న బోథ్ ఎమ్మెల్యే బాపురావు
- ఎన్నికల వేళ అధికార పార్టీలో ప్రకంపనలు

అధికార బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. టికెట్ దక్కకపోవడంతో ఇన్నాండ్లు అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ తాజాగా పార్టీకి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే టికెట్ దక్కని మరో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సైతం అధిష్టానం తీరు పట్ల అసంతృప్తితో పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించగా.. తాజాగా రేఖానాయక్ తీసుకున్న నిర్ణయం అధికార పార్టీలో ప్రకంపనలు రేపుతోంది. శుక్రవారం ఖానాపూర్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించిన రేఖానాయక్ పార్టీకి రాజీనామా చేస్తున్న విషయాన్ని వెల్లడిస్తూ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ నుంచి పోటీ చేస్తున్న జాన్సన్ నాయక్ అసలు ఎస్టీయే కాదని.. పార్టీ ఎలా టికెట్ కేటాయిస్తుందని ప్రశ్నించారు. పారాచూట్ ఫ్రెండ్‌కు టికెట్ కేటాయించి తన గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో మహిళలకు, ఎస్టీలకు ప్రాధాన్యం లేదని విమర్శనాస్త్రాలు సంధించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న సందర్భంలో ఎమ్మెల్యే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఖానాపూర్

మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో రాష్ట్రంలోని అధికార బీఆర్ఎస్ పార్టీలో ప్రకంపనలు మొదలయ్యాయి. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం ముగ్గురు ఎస్టీ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆసిఫాబాద్ నుంచి టికెట్ దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నారు. ఎంపీ టికెట్ భరోసాతోనే ఆయన మిన్నకుండిపోయారనే ప్రచారం జరుగుతుండగా...బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్ మాత్రం అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. టికెట్ రాకపోయినప్పటికీ తొలుత రాథోడ్ బాపురావు సైతం సైలెంట్‌గా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. కానీ ఇటీవల హైదరాబాదులో ఆయనకు మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ లభించకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆయన పార్టీలో గుర్తింపు లభించడం లేదనే కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మరుసటి రోజున అధిష్టానం జోక్యం చేసుకొని మంత్రి కేటీఆర్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడటంతో ప్రస్తుతం మిన్నకుండిపోయారు. కానీ పార్టీ మాత్రం వివిధ పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపికలో ఎమ్మెల్యే ప్రమేయాన్ని తొలగించి ఈ బాధ్యతను ఎమ్మెల్సీ దండే విఠల్‌కు అప్పగించింది. దీంతో ఈ పరిణామాలపై ఎమ్మెల్యే బాపురావు సైతం పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే పార్టీలో కొనసాగుతారా..లేదా అనే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆ పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

పార్టీపై రేఖానాయక్ తీవ్ర ఆగ్రహం..!

బీఆర్ఎస్‌లో ఉద్యమ కాలం నుంచి కొనసాగుతూ ఖానాపూర్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేఖానాయక్‌కు రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ నిరాకరించింది. ఆమె స్థానంలో మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడైన భూక్యా జాన్సన్‌నాయక్‌కు కేటాయించింది. ఈ పరిణామాలపై అసంతృప్తి.. ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె జాన్సన్ నాయక్ అసలు ఎస్టీయే కాదని సంచలన ఆరోపణలు చేశారు. ఆమె భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేశారు. దీంతో రేఖానాయక్ కూడా కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు పంపించారు. టికెట్ విషయమై ఢిల్లీకి కూడా వెళ్లి కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోపక్క బీఆర్ఎస్ పార్టీ వివిధ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఈమె ప్రమేయాన్ని తగ్గించి ఈ బాధ్యతను ఎమ్మెల్సీ దండె విఠల్‌కు అప్పగించింది. నిధులు కూడా విడుదల చేయడం లేదని ఆమె ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన ఆమె పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో మహిళలకు సరైన ప్రాధాన్యం లభించడం లేదని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో ఎస్టీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ఏ పార్టీలో చేరేది త్వరలోనే వెల్లడిస్తానని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీ టికెట్ కేటాయించలేదు. ఈ ముగ్గురు కూడా ఎస్టీ ఎమ్మెల్యేలు కావడం.. ఇందులో ఆత్రం సక్కు సైలెంట్‌గా ఉండగా.. మిగిలిన ఇద్దరు మాత్రం పార్టీపై దిక్కార స్వరం వినిపించడం చర్చనీయాంశంగా మారుతోంది. ఎన్నికల వేళ ఈ పరిణామాలు అధికార పార్టీకి ఇబ్బందికరంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదిలాబాద్‌లో ఆశాల రాస్తారోకో

- స్వల్ప ఉద్రిక్తత, సీఐటీయూ నాయకుడి అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా కార్యకర్తలకు ఫిక్స్ వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఇతర న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని సమ్మెలో భాగంగా శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం నుండి కుమురం భీమ్ చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ రోడ్డుపై బైటాయించారు. నినాదాలు చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని రోడ్డుపై బైటాయించిన ఆశాలను, నాయకులను లేపేందుకు ప్రయత్నించారు. వారు వినకపోవడంతో సిఐటియూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్‌ను పోలీసులు వాహనంలో ఎక్కించి టూటౌన్‌కు తరలించారు. అయినప్పటికీ ఆశాలు వినకపోగా అక్కడే బైటాయించి సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. దీంతో పోలీసులు నిరసకారులను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం ఆశాలు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపి అరెస్ట్ చేసిన కిరణ్‌ను విడుదల చేయాలని నినదించారు. కిరణ్‌ను విడుదల చేయడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వ మాత్రం దాటవేత ధోరణి అవలంబిస్తు ఆశా వర్కర్లపై తీవ్రమైన ఆరోపణలు చేస్తోందన్నారు. కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా ప్రాణాలను ఫణంగా పెట్టి పేద ప్రజలకు సేవలందించి ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందినా ఆశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్లతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు లక్ష్మి, ఆశ, పుష్ప, రుక్మిణి, పద్మ, దీక్ష పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



కాగజ్‌నగర్‌రూరల్ : అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అన్నివర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన సీతానగర్ గ్రామానికి చెందిన రాంటేంకి విజయ్ కుమార్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. నాగంపేట్ గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. రాస్పల్లి గ్రామంలో రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పాత సార్సాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, మాజీ జెడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, గజ్జి వాసుదేవ్, గజ్జి లింగయ్య, అయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తాండూర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంఈఓ వాసాల ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సంగ్రహణాత్మక పరీక్షలను పరిశీలించారు. ప్రశ్నాపత్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాలయంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సుమన, ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నాగరాజు పాల్గొన్నారు.

సెంట్రల్ జాబ్స్ కాదని..కానిస్టేబుల్ ఉద్యోగం



ఆదిలాబాద్‌టౌన్ : తాను పోలీస్ అవ్వాలనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు ఓ యువకుడు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన మెదరి రామస్వామి-శ్యామల కుమారుడు వినీత్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆయన పోలీస్ కావాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నాడు. కుటుంబంలో ప్రభుత్వం ఉద్యోగిగా పేరు పొందాలని నిర్ణయించుకున్నాడు. లక్ష్యానికి అనుగుణంగా కష్టపడ్డాడు. 2022లో సీఐఎస్ఎఫ్ కొలువు సాధించాడు. 2023లో జీడీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. రెండు కూడా సెంట్రల్ ఉద్యోగాలే. కానీ వాటిని కాదనుకొని స్టేట్ ఉద్యోగానికి ప్రయత్నించాడు. చివరికి ఉద్యోగం సాధించాడు. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంతో హర్షం వ్యక్తం చేశాడు. కుటుంబీకులు స్నేహితులు అభినందనలు తెలుపుతూ కేట్ కట్ చేసి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

బోథ్ : మండల కేంద్రానికి చెందిన చెందిన ఎన్నం నవీన్(24) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏడాదిన్నర క్రితం ప్రమాదానికి గురై తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. అప్పటి నుంచి తరచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. నొప్పులు భరించలేక జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నాడు. భార్య పూజిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

బతుకమ్మ ఆడి..వంటావార్పు చేపట్టి..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన మధ్యాహ్న భోజన కార్మికులు తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడారు. పెండింగ్ బిల్లులతోపాటు పెరిగిన జీతాలను ఏరియర్స్ సహా చెల్లించేవరకూ సమ్మెను విరమించే ప్రసక్తేలేదని భోజన కార్మికులు స్పష్టం చేశారు. గతంలో సమ్మె చేసిన సందర్భంలో బడ్జెట్ వచ్చిందని, ఖాతాల్లో డబ్బులు, పెండింగ్ బిల్లులు జమ చేస్తామని అధికారులు చెప్పారని అన్నారు. కానీ ఇంతవరకు వాటిని ఖాతాల్లో మాత్రం జమ చేయలేదన్నారు. దీంతో మళ్లీ సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెంచిన జీతాలను ఏరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా రాగిజావాకు ఒక్క విద్యార్థికి రూ.15 పెంచాలని, పెండింగ్‌లో ఉన్న పది నెలల కోడిగుడ్డు బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె శిబిరం వద్ద వంటావార్పు నిర్వహించారు. సమ్మెకు భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళినిరెడ్డి మద్దతు తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. పట్టణంలోని కైలాస్‌నగర్ అశోక బుద్ధ విహార్ ప్రాంగణంలో నిర్మించనున్న ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి బౌద్ధ వందనం చేశారు. మరోవైపు పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీ పరిధిలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులతో కలిసి భూమిపూజ జరిపారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా నిలబడుతూ అందరి సంక్షేమం కోసం పాటు పడుతున్నామని అన్నారు. ప్రజా ఇక్కట్లను దూరం చేయడానికి చేసిన అభివృద్ధి చిరకాలం నిలిచిపోతుందని స్పష్టం చేశారు. బుద్ధ విహార్‌ల నిర్మాణానికి సైతం పూర్తి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో మిగిలిన సమస్యలను సైతం పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భీంరావ్ వాగ్మారే, జనరల్ సెక్రెటరీ దాదా సాహెబ్ జబడే, ఉపాధ్యక్షులు ఉద్ధవ్ సూర్యవంశీ, కోశాధికారి అంబాజీ పవర్, నాయకులు గంగారెడ్డి, స్వరూపరాణి పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



బేల: గ్రామీణ యువకులు సైతం క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికెళ్లాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సీఎం కేసీఆర్ క్రీడా కిట్లను యువకులకు అందించారు. అంతకు ముందు వివిధ గ్రామల నుండి వచ్చిన ప్రజలు బేల నుండి కార్యక్రమ స్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రూ.36లక్షలతో నిర్మించిన మరాఠా సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం తరుపున ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గ్రామీణ యువకులు సైతం క్రీడల్లో రాణించేలా సిఎం కేసీఆర్ గ్రామగ్రామాన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి యువకులకు క్రీడా పరికరాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలందరీ మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని, ఇతర పార్టీల నాయకులు విమర్శించడం సహజమని అన్నారు. ప్రజలందరికి సంక్షేమ పథకాలు ఇలాగే కావాలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు వట్టిపెల్లి ఇంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, దేవన్న, జక్కుల మధుకర్, సతీష్ పవార్, సుదర్శన్, మంగేష్ ఠాక్రె, భేదోడ్కర్ జితేందర్, బాలచందర్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కుటుంబ బాధ్యత మోస్తూ ఉద్యోగం కైవసం



ఇచ్చోడ : నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన సుద్దాల భీమన్న, గంగమణి దంపతుల రెండవ కుమారుడు సుద్దాల స్వామి పేద కుటుంబంలో జన్మించి, కుటుంబ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా మరో పక్క కుటుంబ బాధ్యతలు మోస్తూ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. డ్రైవర్‌గా, కూలీగా పనిచేస్తూ కుటుంబానికి ఆర్థిక సహకారం చేస్తూ కష్టపడి చదివి ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. కోరుకున్న ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, ప్రముఖులు, మిత్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్సీని కలిసిన మండల నాయకులు

లక్ష్మణచాంద : మండలానికి చెందిన ఎంపీటీసీలు శుక్రవారం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుజ్జరి గణేష్, నాయకులు బూసి ముత్యం, పడిగెల సురేష్, రాహుల్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎక్స్ రోడ్డు వద్ద నుంచి దివ్యనగర్ కాలనీ వరకు రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భూమిపూజ చేశారు. రోజు రోజుకు నిర్మల్ మున్సిపాలిటీని ఆదర్శంగా, ఆకర్షణీయంగా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

షాదీఖానా షెడ్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలో షాదీఖానా షెడ్ నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ ఆంథోనీ అలెగ్జాండర్, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్‌తో కలిసి భూమిపూజ చేశారు. షాదీఖానా షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుద్దాల లక్ష్మి జగన్, మౌలానా రిజ్వాన్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ అయ్యాస్, మల్లేష్ మక్బూల్ బాయ్, ఎండీ షర్ఫుద్దీన్, షాప్ భాయ్, ఎండీ హకీమ్, ముబారక్ బిన్ మొహమ్మద్, గౌస్ ఉద్దీన్, కౌసర్, సయ్యద్ వసీం, సయ్యద్, అన్వర్, కలీం, గయాస్, ముల్లా, ఎండీ హసీబ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాన్ని కుభీర్ మండలంలోనే కొనసాగించాలి

- రాస్తారోకో చేసిన గొడిసెర గ్రామస్తుల



నవతెలంగాణ-కుభీర్

తమ గ్రామాన్ని కుభీర్ మండలంలోనే కొనసాగించాలని, నూతనంగా ఏర్పడిన మాలేగాం మండలంలో కలుపొద్దని గొడిసెర గ్రామస్తులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. గత రెండు రోజుల కింద మండలంలోని మాలేగాంను నూతన మండలంగా ఏర్పాటు చేస్తూ జీఓ జారీ చేయడంతో ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాలేగాంను నూతన మండలంగా విడుదల చేసిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాలేగాం వద్దు కుభీర్ ముద్దు అంటూ నినాదాలు చేస్తూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆందోళన చేపట్టారు. అదే విధంగా నూతన మండలానికి వెళ్లాలంటే 12 కిలో మీటర్ల దూరం అదే కుభీర్‌కు వెళ్తే 6కిలో మీటర్ల దూరం ఉండటంతో మా గ్రామాన్ని కుభీర్ మండలంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. తహసీల్దార్ ముంజం సోము కుభీర్, కుంటాల ఎస్సైలు ఆందోళనకారులను సముదాయించి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అంతర్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన లక్ష్మీపూర్ చెక్ పోస్టును జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల తహసీల్దార్ రాజమోహన్ ఎస్సై ధనశ్రీ ఇతర శాఖల అధికారులకు సిబ్బందికి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలని అధికారులను కోరారు. రానున్న ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు వంటి రవాణాను అరికట్టేలా పగడ్బందీగా పర్యవేక్షించాలని మండల అధికారులకు సూచించారు. సరిహద్దుల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్ మోహన్, స్థానిక ఎస్సై ధనశ్రీ, రెవెన్యూ, ఆబ్కారీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సైన్స్ డిగ్రీ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అచ్చి శ్రీనివాస్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది నుంచి బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ప్రస్తుతం శ్రీనివాస్ ఇదే కళాశాలలో ఆంగ్ల సహచార్యునిగా పనిచేస్తున్నారు. డిగ్రీ అధ్యాపకులుగా 15 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకుని, డాక్టరేట్ పట్టా కలిగి ఉన్న 27 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాల్‌లుగా పదోన్నతులు కల్పించారు. అందులో డాక్టర్ శ్రీనివాస్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియామకం పొందగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే డాక్టర్ శ్రీనివాస్ ఇదే కళాశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. నూతన ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించి బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తాను చదివిన, ప్రస్తుతం పని చేస్తున్న కళాశాలలోనే రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియామకం పొందడం తన అదృష్టం అన్నారు. అందరం సమష్టిగా కళాశాల అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్, కజర్ల, కుచులాపూర్‌లో ఇటీవల మరణించిన కుటుంబాలను శుక్రవారం బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. కుచులాపూర్ గ్రామానికి చెందిన ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్ అమ్మ ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల కన్వీనర్ వెంకటేష్, కేదరీశ్వర్‌రెడ్డి, సంతోష్, దీపక్, జీవన్‌రెడ్డి, గంగాధర్, దేవా రెడ్డి, మండల నాయకులతో పాటు ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన నాయకులు ఉన్నారు.

అల్పాహార పథకం ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టింది అందులో భాగంగా జిల్లాలోని సోన్ మండలంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని శుక్రవారం మంత్రి ఐకేరెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని తిన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆకలి బాధలు లేకుండా పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు, పోషకాహార స్థితిని మెరుగుపర్చడం, పాఠశాలల్లో విద్యార్థులు హాజరు పెంచడం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ వినోద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి రోజు నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు టిఫిన్లను నాణ్యతతో అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఎదుగుదలకు దోహదపడటంతో పాటు తరగతి గదిలో ఏకాగ్రత మెరుగవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి అల్పాహారం పథకం బడి పిల్లల భవితకు వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమురం విజయలక్ష్మి రాజు, విద్యాశాఖ అధికారి జయశీల, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, సర్పంచ్ కంది మమత, ఎంపీటీసీ బిక్కి గంగాధర్, ఉపసర్పంచ్ రమేష్, ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలోని స్థానిక బాలికల పాఠశాలలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార కార్యక్రమాన్ని శుక్రవారం ఆదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో అల్పాహార పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకానికి ప్రభుత్వ పాఠశాలలోని చదువు కుంటున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండటానికి ఉదయం పోషకాలతో కూడిన ఆహారం తీసుకొనుట వలన దృఢంగా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఎంపీడీఓ, సుశీల్ రెడ్డి, ఎంపీఓ జీవన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయుడు పోశెట్టి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- సమ్మె శిబిరాన్ని సందర్శించిన మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 9 రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న వారి సమ్మె శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11నెలలుగా వారికీ బిల్లులు చెల్లించకుండా, వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రుల వేతనాలు నెల నెలకు తీసుకుంటున్నారని అన్నారు. కానీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు, వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం వారితో చర్చలు జరిపి వారి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధొనిపెల్లి స్వామి, ఎస్.లక్ష్మి, కనకే సుమన్, జాడే లక్ష్మి కాంలే సంగీత, కన్నేవారి ఇందిరమ్మ పాల్గొన్నారు.

కడెం : మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాన్ని వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్‌కు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పదేపదే రాష్ట్ర ప్రభుత్వానికి చెపుతున్న ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మధ్యాహ్నన భోజన కార్మికులకు పెంచిన గౌరవ వేతనాన్ని నెలలు గడిచిన ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. ప్రతి కార్మికురాలికి ఐడి కార్డు, యూనిఫాంలు, వంట సామాగ్రి ఇవ్వాలని తెలిపారు. కోడిగుడ్లు ఉచితంగా, గ్యాస్‌ను సబ్సిడీ ద్వారా అందించాలని అన్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రంలో ఇస్తున్నట్టు నిత్యవసర వస్తువులు, ప్రభుత్వమే ఉచితంగా ప్రభుత్వ పాఠశాలకు సరఫరా చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనాల కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ, మండలాధ్యక్షురాలు లత, కార్యదర్శి వెంకవ్వ, దస్తురాబాద్ మండల అధ్యక్షులు శంకరవ్వ, కార్యదర్శి సతవ్వ, రాజవ్వ, శంకరమ్మ పద్మ రవీంద్ర, కార్యదర్శి, బుచ్చవ్వ, గంగామణి, గంగవ్వ, పోసవ్వ శంకరయ్య, వినోద, స్వప్న, రాజవ్వ, మమత పాల్గొన్నారు.





ఆశాల డిమాండ్లను పరిష్కరించాలని రాస్తారోకో



నవతెలంగాణ-నిర్మల్

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చంద్రకళ, సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం అత్యధిక వేతనాలు ఇస్తున్నమని చెప్పేసి అబద్దాలు ఆడుతున్నారని అన్నారు. ప్రతిపక్షాల రెచ్చగొట్టడం వల్ల ఆశాలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు నిందలు మోపడం దురదృష్టకరమని అన్నారు. ఈ రకమైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇచ్చే పారితోషకాలను నిర్ణిత వేతనంగా చెల్లించాలని, చాలీచాలని వేతనాలతో ఇంకా ఎన్ని రోజులు బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్, ప్రమాద బీమా సౌకర్యం, నెలకు రూ.18 వేలు ఇవ్వాలని అన్నారు. పని భారం తగ్గించాలని జాబ్ చార్ట్‌ని పెట్టాలని అన్నారు. స్టేషనరీ ప్రభుత్వమే ఇవ్వాలని, ప్రసూతి సెలవులను ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఆశాల డిమాండ్ల గురించి యూనియన్ నాయకులతో చర్చించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో కార్యక్రమంలో రోజా, రాణి, రామలక్ష్మి, పద్మ, భాగ్య, రాధ, అనురాధ, మంగ, ఇంద్రజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుభీర్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. అందులో భాగంగానే వినతిపత్రాన్ని అందజేసి సమస్యలు విన్నవించారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు ఆశాలతో పనులు చేయించుకుంటారని అన్నారు. తమకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాలు పాల్గొన్నారు.

ఇచ్చోడ : ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాత్లే శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ఆశా కార్యకర్తలు చేపడుతున్న నిరవధిక సమ్మె సందర్భంగా ఆశా కార్యకర్తలకు అరటి పండ్లు పంపిణీ చేసి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గత 12 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు మా సకల కళా సంక్షేమ సంఘం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వీరి సమస్యల పరిష్కార దిశగా ఆలోచించి, ఆశా కార్యకర్తలు పనిచేస్తున్న మా ఆదివాసీ, దళిత, బీసీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం సభ్యులు ఆనంద్, చాహకటి రమేష్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం

నవతెలంగాణ-తలమడుగు

అన్ని రంగాల్లో అర్లి(కె) గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని అర్లి(కె) గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేశారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనిల్ జాదవ్ గెలుపు కొరకు ఒకే ఊరు ఒకే పార్టీ అనే నినాదంతో బీఆర్ఎస్‌లో చేరినందుకు గ్రామస్తులను అభినందించారు. బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ నామినేషన్ ఖర్చులు మొత్తం అర్లి(కె) గ్రామస్తులు భరిస్తామని చెప్పడం గొప్ప విషయమని అన్నారు. అనిల్ జాదవ్ గెలవగానే మొట్టమొదటిసారిగా మీ గ్రామంలోని అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని దీనికి నేను సైతం హజరవుతానని అన్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ నామినేషన్ డబ్బులు చెల్లిస్తామని గ్రామస్తులు ముందుకు రావడంతో గ్రామస్తులకు రుణం తప్పకుండా తీరుస్తానన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, సర్పంచ్ నారా కిష్టు, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, వీడీసీ చైర్మెన్ అశోక్‌రెడ్డి, సర్పంచులు కళ్లెం కరుణాకర్‌రెడ్డి, పోతారెడ్డి, ఆనంద్, రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ చంటి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, కేదరీశ్వర్ రెడ్డి, సునీతరెడ్డి, వసంత్‌రెడ్డి, గంగాధర్, పోచ్చన్న, జీవన్‌రెడ్డి, గజానన్, సురేందర్‌రెడ్డి, కాళ్ల రాజు, ఆనంద్, అబ్దుల్లా, వివిధ మండలాల గ్రామాల నుంచి వచ్చిన ఆ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగుల నిరసన

- నాలుగో రోజుకు రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. శుక్రవారం వీరి నిరాహారదీక్షలు నాలుగో రోజుకు చేరుకోగా సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వచ్చారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 యూనియన్ జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్ మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ భద్రతతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో నిరవధిక సమ్మెలోకి పోతామని హెచ్చరించారు. చాలీచాలని వేతనాలు ఇస్తూ, వెట్టి చాకిరి చేయిస్తున్నారని వాపోయారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ట్రెజరీ ద్వారా నేరుగా 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధ్యక్షులు మామిడి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, 104 ఉద్యోగులు సురేందర్, ప్రశాంత్, పీర కేశవులు, ఇబ్రహీం, వెంకన్న, ప్రేమ్ కుమార్, వామన్‌రావు, పురుషోత్తం, సంధ్య, పద్మ, సుజాత ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 83 రోజుల నుంచి రిలే దీక్షలు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనికి నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేంతవరకు వరకు ఉద్యమం ఆగేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పసుల చంటి, షేక్ షాకీర్, సల్లా రవి, అబుద్ పాల్గొన్నారు.

గ్రామం నుంచి తొలి మహిళ కానిస్టేబుల్‌గా రుచిత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏది లేదని, పేదరికం దానికి అడ్డుకాదని నిరూపించింది. తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన అగ్గిమల్ల రాధ వెంకటిల కుమార్తె రుచిత ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆమె ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తల్లిదండ్రుల కల నెరవేర్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించడానికి తన వంతుగా కృషి చేసింది. గతంలో ఒకసారి కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నించగా 3 మార్కుల తేడాతో ఉద్యోగం సాదించలేకపోయింది. అయిన సరే నిరాశకు గురి కాకుండా వెనకడుగు వేయకుండా కష్టపడి ఉద్యోగం సాధించాలని పట్టుదలతో కృషి చేసింది. ఎట్టకేలకు ఉద్యోగం సాధించేసింది. కాగా తన కుటుంబంలో, ఆ ఊరిలో తొలి మహిళ కానిస్టేబుల్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం విశేషం. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ రుచితను అభినందించారు. తోటి విద్యార్థులు, కుటుంబీకులు పాఠాలు నేర్పిన గురువులు ఆమెను అభినందించారు. ఇలాగే ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాదించాలని పలువురు ఆకాక్షించారు.

లైబ్రరీ నుండి 25 మందికి సర్కార్ కొలువులు

ఆదిలాబాద్ పట్టణంలోని లైబ్రరీలో పోలీస్ ఉద్యోగానికి సన్నద్ధమైన వారిలో దాదాపు 25 మంది కొలువులు సాధించారు. తాజాగా వెలువడిన పోలీస్ ఫలితాల్లో పలువురు సివిల్, ఏఆర్‌గా కానిస్టేబుల్స్‌గా, జైల్ వార్డెన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మునేశ్వర్, గ్రంథ పాలకులు శ్రీనివాస్, పాఠకుల సంఘం జిల్లా అధ్యక్షులు సాత్విక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగాలు సాధించిన యువకులకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైబ్రరీ సేవలను సద్వినియోగం చేసుకొని యువత మరెన్నో జాబ్స్ సాధించాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సరైన పోషకాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

సరైన పోషకాహారం క్రమపద్ధతిలో తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ధన్‌రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అనీమియా సే నిర్మల్ ముక్త్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులకు అనీమియా వల్ల వచ్చే సమస్యలు, నివారణపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన నుంచి ప్రసవం అయ్యేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తహీనత వల్ల ప్రసవ సమయంలో తల్లికి బిడ్డకు అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారు కేవలం మందులు మాత్రమే కాకుండా విరివిగా లభించే పోషకారాలను తీసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. అలాగే క్యారెట్, బీట్ రూట్ జ్యూస్‌లు తాగాలని పేర్కొన్నారు. మనం తీసుకునే ఆహార పదార్థాలు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి ద్వారా మనకు లభించే పోషకాల గురించి వివరించారు. గర్భిణులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన అందుబాటులో ఉన్న ఆశా, ఎఎన్ఎంల సహకారంతో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, హెచ్ఈఓ దాజీబా, సూపర్‌వైజర్ మాధురి, భవానీ, ఏఎన్ఎంలు సుమతి, శారద, కళా, శోభారాణి, కౌసల్య, జమున ల్యాబ్ టెక్నీషియన్ మాధవ్, హెల్త్ అసిస్టెంట్ రాజేశ్వర్, అంగన్‌వాడీలు, గర్భిణులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనస్సు తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | అక్టోబర్ 07, 2023 | www.navatelangana.com

క్రీడా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్, టెన్నికాయిట్ రింగ్స్ క్రీడా సామాగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం ప్రదర్శించి ఉన్నతంగా ఎదగాలని గ్రామ సర్పంచ్ ఆత్రం సంజీవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.సుధాకర్, మాజీ ఎంపీటీసీ నికూరె నాగేందర్, ఉపాధ్యాయులు సాంబశివరావు, బడుగు శ్రీనివాస్, గులాబ్ రావు, సంపత్, మోహన్, పండరి నాథ్, ప్రదీప్, శైలజ పాల్గొన్నారు.



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దహెగాం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొంచవెల్లి, కల్వాడ, బామానగర్ గ్రామాల రోడ్లకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంచవెల్లి నుండి బామానగర్‌కు ఎస్‌డీఎస్ నిధులు రూ.45లక్షలతో బీటీ రోడ్డు, అలాగే రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, బామానగర్ గ్రామానికి రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు, కొంచవెల్లి గ్రామానికి రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు రౌతు రాజన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.



సీఎం హామీ నిలబెట్టుకోకపోతే సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుటోసోర్సింగ్ ఉద్యోగులందరిని బేషరతుగా రెగ్యులర్ చేస్తానని సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోతే రానున్న రోజుల్లో సమ్మె చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. శుక్రవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన ఉద్యోగులతో కలిసి జిల్లా వైద్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి నేటికీ దశాబ్ద కాలం పూర్తవుతున్నా ఒక్క ఉద్యోగిని కూడా పర్మినెంట్ చేయలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్టు నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మధుకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వికాస్, నాయకులు మృదుల్, మండల్, ముస్తాక్ హుస్సేన్, నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బుడిపెల్లి మధుకర్, షకీల్, సధాలక్ష్మి, రాణి, గంగుభాయ్, లక్ష్మీ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు పెద్దన్న కేసీఆర్

నవతెలంగాణ - కౌటాల

ఆడబిడ్డలకు పెద్దన్నగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని సర్పంచ్ మడావి రేణుక అన్నారు. శుక్రవారం మండలంలోని వీర్దండి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డలకు పంపిణీ చేసిన బతుకమ్మ చీరలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డల ఆత్మగౌరవ పండుగ బతుకమ్మ అని, దానికోసం అందమైన నాణ్యతగల చీరలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అంతేకాకుండా దేశంలో ఎక్కడాలేని విధంగా మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలన్నారు.

దళితులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిఓ 342 ప్రకారం దళిత కుటుంబాలకు 101 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. దళిత సంఘ నాయకులతో కలిసి శుక్రవారం ఏడీ సునీతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత కుటుంబాలకు 101 యూనిట్లు ఉచితంగా అందించాలన్నారు. ధనికులకు, పెట్టుబడుదారులకు, గజిటెడ్ ఉద్యోగులకు, ధనవంతులకు, వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్తు అందిస్తుందని, ఇల్లు, భూమిలేని నిరుపేదలైన దళిత కుటుంబాలకు 101 యూనిట్ల విద్యుత్తు అందివ్వడం లేదన్నారు. వెంటనే అన్ని కుటుంబాలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులం సర్టిఫికెట్లు అందజేయలేదని సాకుతో విద్యుత్తు సబ్సిడీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం ఆన్లైన్ సమాచారం ప్రకారంగా దళిత కుటుంబాల జాబితా ఉన్నదని, ప్రతి దళిత కుటుంబానికి ఉచిత విద్యుత్తు అందించాలని కోరారు. ప్రభుత్వం జీవో అమలు చేయకుంటే రానున్న రోజుల్లో విద్యుత్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవిపియస్ జిల్లా ఉపాధ్యక్షులు మాస్కు నగేష్, డోంగి మహేశ్వర్, నాయకులు జాడి రామయ్య, బాబాజీ, సోమేశ్వర్, గణేశ్, రమేష్, విలాస్ పాల్గొన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

నవతెలంగాణ-బెజ్జూర్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలకు దివంగత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలకు బాపూజీ పేరు పెట్టాలని తీర్మానించామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ జాతిపిత, నిబద్ధత కలిగిన రాజకీయవేత్త, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తిదాతని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. నిస్వార్థంగా, నిజాయితీగా ప్రత్యేక తెలంగాణ సాధన కోసం నినదించారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అంతటి మహనీయుడి పేరుపెట్టి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఇందులో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి కనుకుట్ల వెంకటేశ్, అవదూత సత్యనారాయణ, తేలి రాజేషం, పర్శ రమేష్, పర్శ గణేష్, అనిల్, ఇప్పకాయల శంకర్, నాగేష్, మల్లెల శ్రీకాంత్ ఉన్నారు.

అల్పాహార పథకం ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణ రావు ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. జెడ్పీ వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణ రావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం పెట్టే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. పిల్లల్లో పౌష్టికహార లోపాన్ని నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మెన్ రాచకొండ గిరిష్, ఎంఈఓ గడ్డం బిక్షపతి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

పట్టణంలోని గ్రంథాలయంలో అనేక సమస్యలున్నాయని, నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రంథాపయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో కనీసం కూర్చోడానికి కూర్చీలు సైతం లేవన్నారు. పట్టణ ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో వేల మంది విద్యార్థులు పోటీ పరీక్షలకి సన్నద్ధం అవుతారని, వారికి చదువుకోవడానికి కనీసం సరైన గ్రంథాలయం లేదన్నారు. గతంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చినప్పటికీ అది హామీగానే మిగిలిపోయిందన్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం వాళ్ళ రాజకీయ స్వలాభం కోసం ఆలోచిస్తున్నారే తప్ప నిరుద్యోగుల బాగుకోసం ఆలోచించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలు బాగుపడాలంటే గ్రంథాలయాలు, స్టడీ సర్కిల్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో సౌకర్యాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయి, క్రిష్ణ పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నవతెలంగాణ - సిర్పూర్(టి)

సమస్యలు పరిష్కరించాలని సమ్మెలో భాగంగా మధ్యాహ్నభోజన కార్మికులు శుక్రవారం ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జీవో నెం.8 ప్రకారం వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలని, పెరిగిన వేతనాల చెల్లింపుకు బడ్జెట్ విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూప, కాంతమ్మ, విజయ, నీలమ్మ, పోశక్క పాల్గొన్నారు.

దహెగాం : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్నభోజన కార్మికులు మండల కేంద్రంలోని దుకాణాల్లో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం పెట్టిన చేతులతోనే అడుక్కుతినే పరిస్థితి దాపరించిందన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు లలిత, విజయ, లక్ష్మీ పాల్గొన్నారు.

రెబ్బెన : తొమ్మిది రోజులుగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు ఇప్పటి వరకు ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చనందుకు ఖాళీ ప్లేట్లతో మండలకేంద్రంలోని బస్టాండు జాతీయ రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మా ప్లేట్లలో మట్టి పోస్తారో అన్నం పెడుతారో అంటూ వెంటనే తేల్చండని నినాదాలు చేశారు. సీఐటీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు వీరికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఒకటి నుండి ఐదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నుండి అల్పాహారం పథకం ప్రారంభిస్తామని ప్రకటిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికులకు పెరిగిన జీతాలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా కొత్త పథకం ఎలా విజయవంతమవుతుందని ప్రశ్నించారు. కొత్త మెనూ, కొత్త బడ్జెట్ లేకుండా పిల్లలకు పౌష్టికాహారం ఎలా వండిపెట్టాలన్నారు. సమ్మె చేస్తున్న మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పెరిగిన జీతాలను వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోడిగ్రుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, సబ్సిడీ క్రింద గ్యాస్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాగిడి మాయ, పోసుబాయి, తానుబాయి, గోత్రె లక్ష్మీ హసీనా, ఆర్.విజయ పాల్గొన్నారు.



దహెగాం :



రెబ్బెన :

బీఎస్పీ ఆధ్వర్యంలో రోడ్లకు మరమ్మతులు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలం కేంద్రంలో రోడ్లకు శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, జిల్లా అధ్యక్షులు మోర్లే గణపతి, జిల్లా కార్యదర్శి కొండా రాంప్రసాద్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడాం గణపతి మాట్లాడుతూ భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. బాగు చేయాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రజలు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఎంపీటీసీ సుశీల, తిరుపతి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి ఎంపీటీసీ చొరవతో మొరంతో మరమ్మతులు చేపట్టామన్నారు. అధికారంలో లేకున్నా బీఎస్పీ మరమ్మతులు చేస్తుంటే అధికారంలోకొస్తే ఇంకెంత అభివృద్ధి చేస్తుందో ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ సిడాం జ్యోతి, నియోజకవర్గ అధ్యక్షులు డోకే రాజన్న, మండల అధ్యక్షులు గోమసే లహంచు, అత్రం సాయి, ప్రధాన కార్యదర్శి దుర్గం శంకర్, నాయకులు నీలగౌడ్, బొగ్గు శంకర్ పాల్గొన్నారు.

కుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమానత్వ, కుల రహిత సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో కేవీపీఎస్ 24వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించినంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన అనే లక్ష్యాల కోసం మహాత్మజ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం తమ సంఘం పోరాడుతుందన్నారు. 24 ఏండ్ల ప్రస్థానంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నడిపి రాష్ట్రంలో ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించేందుకు ప్రధాన భూమిక పోషించిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ స్మశాన వాటిక స్థలాల జీఓ 1235 సాధించిందన్నారు. కులవివక్ష అంటరానితనంపై అసమానతలపై రాజీలేని ఉద్యమాలు నడిపిందన్నారు. కుల దురహంకార దాడులు హత్యలు ఎక్కడ జరిగిన ముందు ఉంటూ పోరాడుతామన్నారు. నేడు కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ పాలకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ మతోన్మాద విధానాలతో దళితులపై అనేక రూపాల్లో సామాజిక అణిచివేతలు, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగేందుకు అనేక కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగారిచే కుటిల యత్నాలు చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగంపై ముప్పేట దాడి చేస్తూ దళితులకు రిజర్వేషన్ల ఫలాలు అందకుండా ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తూ దళితులను అన్ని రంగాల్లో నిరాశ్రయుల్ని చేసిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలకులు దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, వాగ్దానాలు ఇవ్వడం తప్ప వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని మండిపడ్డారు. దళితులకు ఇస్తానన్న మూడు ఎకరాల భూమి, దళితబంధు పథకాల నిర్వహణలో ప్రభుత్వ తీరు తేట తెల్లమవుతుందన్నారు. దళితులంతా ఐక్యంగా ఉంటూ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నగేష్, డోంగ్రే మహేశ్వర్, నాయకులు జాడి రామయ్య, బాలాజీ, సోమేశ్వర్, రమేష్, విలాస్ పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల : బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగెపెల్లి గ్రామంలో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన ద్వారా 18 నుండి 70 వయసు గల వారికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.రెండు లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ద్వారా 18 నుండి 50 సంవత్సరాల వయసు గల సంవత్సరానికి రూ.436 చెల్లించడం ద్వారా రూ.రెండు లక్షల సాదారణ బీమా వర్తిస్తుందన్నారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వయసు గల సంవత్సరానికి రూ.వెయ్యి కట్టినట్టయితే ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే రూ.20 లక్షల బీమా వర్తిస్తుందని, కుటుంబం రోడ్డున పడకుండా ఉంటుందన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్య వయసు గల వారు నెలవారి లేదా మూడు, ఆరు నెలల వాయిదాలలో తగు మొత్తం ప్రీమియం కట్టినట్టయితే 60 సంవత్సరాలు నిండి చనిపోయే వరకు ప్రతినెల రూ.వెయ్యి నుండి రూ.ఐదు వేల వరకు పెన్షన్ వస్తుందన్నారు. ఆ వ్యక్తి మరణించిన తర్వాత వారి జీవిత భాగస్వామికి, భార్యభర్తలు ఇద్దరు చనిపోయిన తర్వాత వారసులకు రూ.1.70 వేల నుండి రూ.8.50 వేల వరకు బ్యాంకులు చెల్లించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీజీబీ క్షేత్రాధికారి మనోహర్, అకౌంటెంట్ రాజేష్, నాగెపెల్లి గ్రామస్తులు జ్యోతిరావు, మహిళా సంఘాల వీఓ అధ్యక్షురాలు శారద, ఉప సర్పంచ్ జ్యోతి, మహిళా సంఘాల సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడితే విజయం తథ్యం

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి
- అంగన్‌వాడీల విజయోత్సవ సభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడితే విజయం తథ్యం అనే విషయం మరోసారి నిరూపితమైందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్. త్రివేణి అన్నారు. 24 రోజులుగా పోరాటం చేసి ప్రభుత్వం డిమాండ్లు ఒప్పుకునేలా చేసిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యంగా పోరాటం చేస్తే విజయం సాధ్యమైన విషయం మరోసారి నిరూపితమైందన్నారు. సమస్యలపై ప్రభుత్వం మంత్రుల ద్వారా రెండుసార్లు చర్చలు జరపడం, పరోక్షంగా తమ విజయమేనన్నారు. పీఆర్సీ కమిటీలో అంగన్‌వాడీలకు చోటు కల్పించడం, ప్రస్తుతం ప్రకటించిన మధ్యంతర భృతి వర్తించేలా ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందన్నారు. మినీ అంగన్‌వాడీలో స్థాయి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే ఉత్తర్వులను విడుదల చేయాలన్నారు. మంత్రితో జరిగిన చర్చల్లో సమ్మె కాలపు వేతనాన్ని ఇవ్వడానికి అంగీకరించారని, ప్రమాదబీమా రెండు రూ. లక్షలు అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సమ్మె విరమిస్తున్నట్లు పీడీ సావిత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.వనిత, అధ్యక్షురాలు గంగామణి, నాయకులు వినోద, కె.నిర్మల, రాజేశ్వరి, జయ, తార మల్లేశ్వరి, ధనలక్ష్మి, వజ్రమ్మ, ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చేంత వరకూ సమ్మె



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

ఆశాల సమస్యలు పరిశీలించాలని, ఫిక్స్‌డ్ వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పెరక శ్రీకాంత్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆశా వర్కర్ల సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు నేటికీ ఫిక్స్‌డ్ వేతనం లేదని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేదన్నారు. కనీసం ప్రసూతి సెలవులు కూడా ప్రభుత్వం నేటికీ నిర్ణయించకపోవడం బాధకరమన్నారు. గతంలో ప్రగతి భవన్‌లో ఆశాలతో సీఎం కేసీఆర్ సమావేశం ఏర్పాటు చేసి ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు ప్రభుత్వం నేటికీ అమలు చేయకుండా ఆశాలను మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి నగరం పద్మ, పంచశీల, భాగ్యలక్ష్మీ, జరీనా, పద్మా లక్ష్మీ, మంజుల, వాణీ, సుభద్ర, కేసరీ, సరస్వతీ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కజేయకుండా సేవలందించిన ఆశా వర్కర్లను డబ్ల్యుహెచ్ఓ గుర్తించి గ్లోబల్ హెల్త్ లీడర్స్ అని అవార్డును ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయే తప్ప వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఆశాలు లలిత, సురేఖ, కవిత, వాణి, లక్ష్మి, యశోద, సుమిత్ర, లత పాల్గొన్నారు.

మీడియాపై బీజేపీ దాడి ఆపాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

మీడియాపై బీజేపీ దాడులు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడే బీమేష్ అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరంతరం ఎండగడుతూ ప్రజలకు చేరవేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్ క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను ఢిల్లీ పోలీసులు క్రూరమైన ఉపా ఆరోపణలను ఉపయోగించి అరెస్టు చేయడం దారుణమన్నారు. తెల్లవారుజామున, ఢిల్లీకి చెందిన పలువురు జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, వారి ల్యాప్‌టాప్‌లు, ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశం స్థానం దిగువ 20 దేశాలకు దిగజారడం ప్రమాదమన్నారు. ప్రభుత్వం, ప్రజలకు వారధిగా నాలుగో స్తంభంగా సూచించె మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కుమురం భీం జిల్లా ఉపాధ్యక్షుడు వసకే సాయికుమార్, సహాయకార్యదర్శి సుంకరి సాయి, క్రిష్ణ, నాయకులు శంకర్, మహేష్, విజయ్, విఘ్నేష్ పాల్గొన్నారు.

సుడి దోమ నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలి

బెజ్జూర్ : మండలంలోని ముంజంపల్లి, మర్తిడి గ్రామాల్లో శుక్రవారం వరి పంట క్షేత్ర ప్రదర్శనలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు రవితేజ, మారుతి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటకు సుడి దోమ సోకి పంట నష్టపోయి దిగుబడి తగ్గే అకాశం ఉందన్నారు. రైతులు సుడిదోమ నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. రైతుల సుడిదోమ నివారణకు పైమెట్రోజిన్ 0.6 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క మొదళ్లు తడిచేల పిచికారి చేసుకుంటే సుడిదోమని నివారించుకోవచ్చని తెలిపారు.

వర్మీ కంపోస్ట్ తయారు చేయాలి

నవతెలంగాణ-తాండూర్



ప్రతీ గ్రామపంచాయతీలలో వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి జరగాలని డీపీఓ ఫణీంధర్ రావు సూచించారు. శుక్రవారం మండలంలోని బోయపలి గ్రామ పంచాయతీని సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ షీట్లు నిరుపయోగంగా కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

కలమడుగును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



కలమడుగు గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల, నిర్మల్ జిల్లాలకు చివరగా ఈ గ్రామం ఉండడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. చుట్టుపక్కల గ్రామాలను కలుపుకొని మండల కేంద్రంగా కలమడుగును ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఈ గ్రామంలోనే పోలీస్ స్టేషన్‌తో పాటు ఇతర కార్యాలయాలు ఉండేవన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొంతల మల్లేష్, సురేష్, రాజన్న, శ్రీకాంత్, గంగాధర్, మహేష్, విష్ణు, నరేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు సర్పంచ్ మేడి రవి సొంత ఖర్చులతో కొత్త దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా ఆరుగురికి రూ.10,500తో దుస్తులను అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే దసరా పండుగకు ముందు కొత్త బట్టలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో చప్పుడు చేస్తూ నిరసన



నవతెలంగాణ-జన్నారం

తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మధ్యాహ్న భోజన కార్మికులు ఖాళీ ప్లేట్లతో చప్పుడు చేస్తూ నిరసన తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని సమ్మె శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు కే బుచ్చయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపుకు బడ్జెట్ కేటాయించి, ఏరియర్స్‌తో ఇవ్వాలన్నారు. కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జువాడి వసంత, లక్ష్మి మండల కమిటీ నాయకులు మల్లవ్వ, జుంబర్తి లక్ష్మి, గౌరీ, మానస పాల్గొన్నారు.

ఆశాల సమ్మెకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

నవతెలంగాణ-మందమర్రి

ఆశా కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మెకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ చైర్మెన్ దుర్గం భాస్కర్ శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వారు చేసిన సేవలు గొప్పవని తెలిపారు. ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేష్, తరుణ్, అభిరామ్, కిశోర్, కుమార్, శివ పాల్గొన్నారు.

కిష్టంపేట సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తాండూర్

ఎమ్మెల్యే దత్తత గ్రామం కిష్టంపేటలో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం కిష్టంపేటలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కిష్టంపేట గ్రామపంచాయతీలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ ముందు రోడ్డుపైన డ్రైనేజ్ నీరు చిన్న వర్షం వచ్చినా రోడ్డు పైన చెరువుల పారుతుందన్నారు. అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహేందర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, ఎస్సీ మోర్చా, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు పాగిడి చిరంజీవి, ఏముర్ల ప్రదీప్, మండల ఉపాధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్, మండల నాయకులు తాళ్లపల్లి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

ఇది ఏ జంతువు...?

- గుర్తు పట్టలేకపోతున్న అటవీ అధికారులు

నవతెలంగాణ - మంచిర్యాల



మండలంలోని గుడిపేట్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై నక్కను పోలిన ఓ అడవీ జంతువు గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతిచెందింది. ఆ జంతువు ఎదనేది స్థానిక ఫారెస్ట్ అధికారులు గుర్తుపట్టక పోవడం గమనార్హం.. ఆ జంతువు చనిపోయిన విషయం స్థానికులు బీట్ ఆఫీసర్‌కు తెలియజేయగా అది ఏ జంతువు అనేది నిర్ధారణ చేయలేకపోయారు. శుక్రవారం రాత్రి వరకు దానిని ఖననం కూడా చేయలేక పోయారు. రోజు గస్తీలో ఉంటున్నామని చెప్పే ఫారెస్ట్ అధికారులు ఆ అరుదైన జంతువు చనిపోయిన విషయం తెలిసిన కానీ కనీసం ఆ ప్రదేశానికి కూడా పోకపోవడం గమనార్హం.

ఉత్తమ సామాజిక హక్కుల కార్యకర్త అవార్డుకు ఎంపిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ నుండి ఉత్తమ సామాజిక హక్కుల కార్యకర్త అవార్డుకు సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది రాజలింగు మోతే ఎంపికయ్యారు. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ చేతుల మీదుగా శుక్రవారం రాజలింగు మోతె స్వీకరించారు. కమిషన్ సభ్యునిగా ఎన్నికైన ప్రవీణ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజలింగు మాట్లాడుతూ తనను గుర్తించి ఇండియన్ ఐకాన్ అవార్డు ప్రదానం చేసిన జ్ఞాన్ ఉదయ్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ముంజంపల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాడి డిగంబర్ కొంతకాలం నుండి అనివార్య కారణాల వల్ల పార్టీకి దూరంగా ఉన్నారు. తిరిగి మళ్లీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడానికి మండలంలోని సుమారు 150 మంది కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించి బీజేపీ మండల అధ్యక్షుడిగా పదవి బాధ్యతలను జాడి డిగంబర్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డుబ్బుల జనార్ధన్, తాళ్ల రామయ్య, వసీఉల్లాఖాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శులు సప్పవాట్ భిక్షపతి, గురునాథం, మురళీగౌడ్, ఉప సర్పంచ్ కోర్త తిరుపతి, కోలా కిష్టయ్య, కొప్పుల దిలీప్, అల్లూరి రామయ్య ఉమ్మరి బాలకృష్ణ, డుబ్బుల నారాయణ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- • ఎఫ్‌డీఓ మాధవరావ్



నవతెలంగాణ-జన్నారం

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్‌డీఓ మాధవరావ్ అన్నారు. శుక్రవారం 69వ వణ్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్‌లో ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అడవుల్లోకి మొదటగా సఫారీ వాహనంలో సందర్శించారు. జంతువులను వీక్షించడం, వాటి ఆవసాల అభివృద్ధి పనులను ఎఫ్‌డీఓ వారికి వివరించారు. టైసన్ కుంట వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ముగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు కవ్వాల్ టైగర్ రిజర్వ్ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాది హామీ పథకం ద్వారా ప్రజలకు 100 రోజుల ఉపాది కల్పిస్తున్నట్లు ఎఫ్‌డీఓ వివరించారు. ఈ కార్యక్రమం ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, వైస్ ఎంపీపీ వినయ్ కుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, ములుగు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జైపూర్ : ప్రకృతి, పర్యావరణ పరిరక్షలో వన్య ప్రాణులు ఒక భాగమే అని శివ్వారం మొసళ్ల అభయారణ్యం ఏరియా సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ అన్నారు. 69వ అంతర్జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శివ్వారం శివారు మొసళ్ల అభయారణ్యంలో శుక్రవారం వన్యప్రాణి వారోత్సవాన్ని జరుపుకున్నారు. చెన్నూర్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధి అటవీ అధికారులతో పాటు చెన్నూర్ మైనార్టీ కళాశాల విద్యార్థులతో మొసళ్ల అభయారణ్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గెట్టింగ్ ఏర్పాటు చేశారు. గుట్ట ప్రాంతంలో శిఖరం వైపు ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన దారితో ఉపరితలానికి ఎక్కడం, అభయారణ్యంలో గల చెట్లు వాటి ప్రాముఖ్యతను వివరించారు. అడవి జాతులకు చెందిన చెట్ల ద్వారా పొందు ఫలితాలు, కలపకు వినియోగించే చెట్లు, పండ్ల చెట్లు, ఔషధ గుణాలు కల్గిన చెట్లు గుర్తించి వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు తెలిపారు. అక్టోబర్ 3 నుండి 9 వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో జరుపుకుంటున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలిసి మొసళ్ల అభయారణాన్ని పరిచయం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు డివిజన్ పరిధి అటవీ రేంజ్ ఆఫీసర్లు శివకృష్ణ, రవి, సోమనపల్లి పంచాయతి ఉప సర్పంచ్ మహేందర్‌రెడ్డి, చెన్నూర్ మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

డీపీఈ గైడ్‌లైన్స్‌లో సడలింపులు ఇవ్వాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

డీపీఈ గైడ్‌లైన్స్‌లో సడలింపులు ఇచ్చి కొత్త వేతనాలను కొనసాగించాలని, లేని పక్షంలో సమ్మె తప్పదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయ్ యూనియన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌కేసీహెచ్‌పీ గనిలో లింగాల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ నాయకులు మాట్లాడారు. డీపీఈ నిబంధనలకు బొగ్గు గని కార్మికులకు మినహాయింపులు ఇవ్వకుండా వేతన ఒప్పందాన్ని రద్దు చేస్తే 12,13,14న సమ్మె తప్పదని హెచ్చరించారు. డీపీఈ గైడ్‌లైన్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా రాజకీయంగా రూ.2.5 లక్షలకుపైగా బొగ్గు గని కార్మికుల వేతనాలతో ఆటలాడుతుందని మండిపడ్డారు. కోల్ ఇండియా సింగరేణికి బడ్జెట్లో ఏమాత్రం నిధులు కేటాయించకుండా వచ్చిన లాభాల నుండి డివిడెంట్లు మాత్రం తీసుకుంటున్నారన్నారు. సింగరేణికి కొత్త గనులు రాకపోతే భవిష్యత్తు ఉండదని, రానున్న రోజుల్లో బొగ్గు రంగం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉన్నుందన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పట్టాలిస్తున్న తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మె కోసం కార్మిక సంఘాలకు కార్మికులందరూ మద్దతు తెలుపాలని ఏ యూనియన్ పిలుపు నిచ్చిన కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి అయిందాల శ్రీనివాస్, బ్రాంచ్ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అలవాల సంజీవ్, అభిలాష్, కార్మికులు పాల్గొన్నారు.

దసరా కానుకగా బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



దసరా కానుకగా మహిళలకు ప్రభుత్వం అందించే చీరలను శుక్రవారం మండల కేంద్రంలో సర్పంచ్ భూషణవేణి గంగాధర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. ఆడపడుచులకు గౌరవం ఇచ్చేల సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగ సందర్భంగా చీరాలను అందిస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జనగాం రవి, కేప నరసింహులు, అన్నే కాంతామని పాల్గొన్నారు.

భీమిని : మండలంలోనీ భీమిని, లక్ష్మీపూర్ గ్రామాల్లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాలను ఆనందోత్సాలతో జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజుల గంగక్క, తహసీల్దార్ బికర్న్ దాస్, భీమిని సర్పంచ్ కమల బాయి, ఉప సర్పంచ్ ఓం ప్రకాష్, ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

తాండూర్ : బతుకమ్మ చీరాలను బెల్లంపల్లిలోని ఆయా వార్డుల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేతా, కౌన్సిలర్ నెల్లి శ్రీలత పంపిణీ చేశారు. అదే విధంగా 17,18 వార్డుల్లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోసిక రమేష్,షేక్ అఫ్సర్, నాయకులు నెలకంటి శ్రీధర్, నెల్లి రమేష్, ఖమర్ పాషా, మహిళ నాయకురాలు శివారపు ఈశ్వరక్క, బొడ్డున పార్వతి, పోలు పద్మ, శ్రావణ్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : ఆడపడుచులకు తెలంగాణ ప్రభుత్వం దసరా పండగ కానుకగా అందిస్తున్న బతుకమ్మ చీర అని ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలను, యువకులకు క్రీడా కిట్లను బాల్క సుమన్, కలెక్టర్ బాదవత్ సంతోష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆడపడుచుల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ ఛైర్ పర్సన్ జంగం కళ, వైస్ ఛైర్మన్ సాగర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

28న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సిందే

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-జైపూర్

ముందుగా ప్రకటించినట్లు ఈ నెల 28న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సిందేనని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఏఐటీయూసీ నాయకులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుర్తింపు సంఘం కాల పరిమితి అయిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సింగరేణి యాజమాన్యం ప్రాతినిధ్యం వహిస్తున్న టీబీజీకేఎస్ సంఘాన్ని కొనసాగించాలని ప్రయత్నించడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికలు ఆపేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నించడం, కోర్టు ముందు కుంటి సాకులు వెలిబుచ్చినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్మిక సంఘాలతో కలిసి ఎన్నికల నిర్వాహణను నిలువరించేందకు ప్రయత్నించి విఫలమయ్యారని తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ పలుమార్లు అన్ని సంఘాలతో జరిపిన చర్చల్లో 14 కార్మిక సంఘాలు ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఫలితంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెప్టెంబర్ 27న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాష్ట్ర నాయకులు వీఎస్ బోసు, వంగల వెంకట్, ఆళవందార్ వేణుమాధవ్, సోమయ్య పాల్గొన్నారు.

పొదుపుతో పాటు పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-జైపూర్



బ్యాంకుల్లో సొమ్ము పొదుపు చేసుకోవడంతో పాటు బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పథకాల పట్ల వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంతోష్ కుమార్ సూచించారు. శుక్రవారం వేలాల గ్రామంలో ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ వారి కళాజాత బృందతో తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారు అందిస్తున్న సేవలు వివరించారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా బ్యాంకు పథకాలు, పంట రుణాలు, పొదుపు రుణాలు, హౌజింగ్, ఎడ్యూకేషన్, బంగారు ఆభరణాలపై రుణాలు పొందు తీరును కళాజాత బృందం ఆట పాటలతో అవగాహన కల్పించింది. అదే విధంగా సామాజిక భద్రత పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనతో పాటు నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్‌తో పాటు సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మన్, ఉప సర్పంచ్ డేగ నగేష్ పటేల్, కళాజాత బృందం సభ్యులు, మెజీషియన్, డప్పు వాయిద్య కళాకారులు, గ్రామానికి చెందిన రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండల ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కందుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా నిజాముద్దీన్, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, కోశాధికారిగా తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, రాజేష్, ప్రచార కార్యదర్శిగా అస్మత్ షరీఫ్, కార్యవర్గ సభ్యులుగా సందినేని శ్రీనివాస్, సంతోష్‌చారి, మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కందుల రమేష్, నిజామోద్దీన్ మాట్లాడుతూ ప్రజలకు, పాలకులకు, అధికారులకు మధ్య వారధిలా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్నామన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సౌకర్యార్థం రోడ్డు



నవతెలంగాణ-మందమర్రి

ఉద్యోగులకు మౌళిక వసతులను కల్పించేల అభివృద్ధి చేపడుతున్నామని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఏరియా జీఎం మనోహర్ అన్నారు. శుక్రవారం రూ. 3.09 కోట్లతో రెన్యూవల్ బీటీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. మందమర్రి ఏరియాలోని రామాలయ ప్రాంతంలో 1,2,3వ జోన్‌లకు రెన్యువల్ బీటీ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జోన్1,2,3ల ఉద్యోగుల సౌకర్యార్థం రోడ్డు వేయడానికి సింగరేణి సీఅండ్ఎండీ శ్రీధర్ చొరవతో రూ.3.09 కోట్లతో వనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సివిల్ ఎస్ఈ జయప్రకాష్, ఎస్ఎస్ఓ రవి, డీవైపీఎం ఎండీ ఆసీఫ్, యూనియన్ నాయకులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో పేరు చూసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

కొత్తగా వచ్చిన ఓటర్ లిస్టులో తమ పేరు ఉన్నదో లేదో చూసుకోవాలని తహసీల్దార్ వనజా రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రదర్శించిన ఓటరు లిస్టును ఆమె పరిశీలించారు. పాఠశాలలో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు పాఠశాలలో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి మురళికి సూచించారు. 2078 ఓటర్లు పెరిగారని, బీఎల్ఓల వద్ద ఓటరు లిస్టు సిద్ధంగా ఉందన్నారు. తమ పేర్లను లిస్టులో సరి చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ భానుచందర్ ఉన్నారు.

యువతకు కేసీఆర్ క్రీడా కిట్లు పంపిణీ



నవతెలంగాణ-భీమారం

యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్నట్లు జడ్పీటీసీ తిరుమల తెలిపారు. శుక్రవారం మండలంలోని బూరుగుపల్లి గ్రామ యువతకు క్రీడా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని కోరారు. క్రీడలతో యువతకు మానసికోల్లాసంతో పాటు చెడు వ్యసనాల వైపు మళ్లకుండా లక్ష్యాల వైపు సాగేందుకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ రమాదేవి, చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్, రైతుబంధు అధ్యక్షుడు అశోక్ నాయక్, నాయకులు శంకర్ నాయక్, వడ్లకొండ మల్లేష్, రాములు, పంచాయతీ సెక్రటరీ బండి రాజశేఖర్, రవితేజ, విజయ్, విఘ్నేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 07, 2023 | www.navatelangana.com

నాలుగేండ్ల బాలికపై వీధికుక్కల దాడి



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సడక్‌గూడ గ్రామంలో వీధి కుక్కలు నాగేళ్ల బాలికపై దాడి చేయడం కలకలం రేపింది. పక్క ఇంటి బయట పిల్లలతో ఆడుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన స్థానికుల వాటిని తరిమికొట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే చిన్నారిని వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా చిన్నారి తల, కంటిపై తీవ్ర గాయాలయ్యాయి. వీధి కుక్కల నుంచి ప్రజాల ప్రాణాలు కాపాడేల అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కొరుగుతున్నారు.

నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ప్రారంభించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని పంచాయతీ భవనాన్ని ప్రారంభించి పరిశీలించారు. పాత గ్రామపంచాయతీ కార్యాలయం నాలుగు వరుసల రహదారిలో పోవడంతో హనుమాన్ ఆలయం వద్ద నూతన కార్యాలయం నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు కొత్త భవనాల కోసం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం సర్పంచ్ తుకారాంను ఎమ్మెల్యే సక్కు, కోవలక్ష్మి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సింగిల్‌విండో చైర్మెన్ పెంటు పాల్గొన్నారు.



కుమురంభీం వర్ధంతికి పటిష్ట ఏర్పాట్లు

- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే

నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురం భీం 83వ వర్ధంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 28న నిర్వహించనున్న వర్ధంతి ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం మండలంలోని జోడేఘాట్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హెలిప్యాడ్, వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పీఓ మాట్లాడుతూ అమరజీవి భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్ధంతి ఉత్సవాన్ని అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. జోడేఘాట్‌లో శాశ్వత సభ వేదిక నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, వేడుకకు వచ్చే ప్రజలకు భోజనం, త్రాగునీరుకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని, నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హట్టి నుండి జోడేఘాట్ వరకు అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై శాఖల వారీగా స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రజల సమస్యల దరఖాస్తులను నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. దర్బార్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు బందోబస్తు చేపట్టాలన్నారు.

వర్ధంతి వేడుకలో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలతో పాటు చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో గిరిజనులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన భీం స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన గిరిజనులకు పోడుపట్టాలను పంపిణీ చేసిందన్నారు. పట్టాలు పొందిన రైతులకు రైతు బంధు అందిస్తున్నామని తెలిపారు. ఆదివాసీ గ్రామాలు, తండాలలో నివాస గృహాలు, త్రాగునీరు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్ధంతి ఉత్సవానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అందరి సహకారం తో వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఏఎస్పీ అచ్చేశ్వర్ రావు, ఈఈ రాథోడ్ భీంరావ్, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, రాయిసెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన స్వయందీప్‌కు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన హట్కర్ స్వయందీప్ ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో విజయం సాధించిన స్వయందీప్‌ను శుక్రవారం మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంటి, మాల సంక్షేమ సంఘం నాయకులు నేతుల గంగన్న, కాడే శ్రీనివాస్, దేవన్న, దిలీప్, అడెల్లు, మల్లేష్, ఉద్దవ్, రాములు, రావుల లింగన్న, సచిన్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన జర్నలిస్టుకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జర్నలిస్టుగా పని చేసి కానిస్టేబుల్‌గా ఎంపికైన లేకురే తులసీరాంను సన్మానించి అభినందనలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘ భవనంలో ఛత్రపతి శివాజీ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొలే బిక్కాజి మాట్లాడుతూ జర్నలిస్టుగా సేవలు అందించి ప్రస్తుతం పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికవ్వడం హర్షనీయమన్నారు. పోలీస్ శాఖలు మంచి సేవలు అందించి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఛత్రపతి శివాజీ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదరులు బెంద్రే సదానందం, కోశాధికారి బొట్టుపల్లి రాజేశ్వర్, ఉప అధ్యక్షుడు కిర్మరే శ్రీకాంత్, సహాయ కార్యదర్శి బొట్టుపల్లి జానకిరామ్, సభ్యులు లోనార్ కిరణ్, జాబోరే మహేష్ పాల్గొన్నారు.

నియర్‌బై బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

డబ్ల్యూటీఎస్‌అండ్‌జీఏ 90వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా గోలేటిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నియర్‌బై బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను డీజీఎం ఎఫ్‌అండ్‌ఏ రామారావు ప్రారంభించారు. పోటీల్లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ఉద్యోగ క్రీడాకారులు పాల్గొంటారు. ప్రథమస్థానంలో నిలిచిన వారు మణుగూరులో నిర్వహించే కంపెనీ స్థాయి పోటీలకు ఎంపికవుతారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, మందమర్రి జనరల్ కెప్టెన్ చిన్నన్న పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ఆరు గ్యారంటీల హామీలు

నవతెలంగాణ-నిర్మల్

అన్ని వర్గాల సంక్షేమమే ఆరు గ్యారంటీల హామీలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సారంగాపూర్ మండలానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులతో పాటు హనుమాన్ తండ, మహావీర్ తండ, సాయినగర్, గ్రామాలకు చెందిన పలువురు యువకులు జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కర్నాటకలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు అండగా నిలుస్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని తెలియజేశారు. అధికారంలోకి రాగానే రైతులకు ఏటా రూ.15వేలు, కూలీలకు రూ.12వేలు, పంటలకు బోనస్, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల రూ.2వేల 500తో పాటు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, ఇండ్లు లేని వారికి రూ.5లక్షలతో ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం, ప్రతీ కుటుంబానికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. యువ వికాసం కింద రూ.5లక్షలతో విద్యా భరోసా కార్డు, వృద్ధులకు నెలకు రూ.4 వేల పింఛన్‌తో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షలతో ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లోజు నర్సయ్య రాజిరెడ్డి, వీజేష్, ధరమ్ సింగ్, దావూద్ రామ్, రవీందర్, సందీప్, దశరథ్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. దసరా పండగ కానుకగా ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోందన్నారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆటల పోటీలో యువత రాణించడానికి ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనుక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పిఎసిఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, సర్పంచ్ గజానంద్ నాయక్, కోఆప్షన్ మెంబర్ దస్తగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేస్రం హనుమంతరావు, ఎంపిడిఓ రమేష్, ఏపిఎం రమేష్, నాయకులు కనక ప్రభాకర్, మహేందర్, దాదే అల్లి, సయ్యద్ ఖాసిం, మోడల్ స్కూల్ చైర్మన్ సుభాష్ రాథోడ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఇంటింటికి సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తూ ప్రజా శ్రేయస్సే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. చాందా(టి), అంకోలి, మావలలో బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా హితమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, అనుక్షణం ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతోందని అన్నారు. క్రీడా కిట్లు, ఆసరా పెన్షన్లతో పేదలకు అండగా నిలుస్తున్నామని, దివ్యాంగులకు అందించే పెన్షన్‌ను సైతం రూ.4వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చందాల ఈశ్వరి రాజన్న, ఆదిలాబాద్ ఎంపీపీ గండ్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, మార్కెట్ చైర్మన్ కొమురం విజయలక్ష్మి రాజు, సర్పంచులు దొగ్గలి ప్రమీల, దారుట్ల భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్, ఏవన్, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన ఆశా వర్కర్ల దీక్ష

నవతెలంగాణ-కెరమెరి

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలపై నిర్లక్ష్యంగా విహరిస్తుందని ఆరోపించారు. తొమ్మిది రోజులుగా విధులను బహిష్కరించి ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులను అంధకారంలోకి నెట్టేస్తున్న ప్రభుత్వాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్
- ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల చదువులను ప్రభుత్వాలు అంధకారంలోకి నెట్టేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహన్ని సందర్శించి, విద్యార్థల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధ్యయనం, పోరాటం అనే నినాదాలతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే లక్ష్యాలతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి శాస్త్రీయమైన విద్యా విధానం అందాలని, ఏ ఒక్క విద్యార్థికి సమస్య తలెత్త కుండా చూడాలన్నారు. విద్యార్థుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాల అయిన నిజమైన స్వాతంత్రం రాలేదన్నారు. చాలామంది తినడానికి తిండి దొరకక ఆకలితో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు గెలిపించిన నాయకులు ప్రజల కోసం పనిచేయడం లేదని విమర్శించారు. పెట్టుబడిదారుల కోసం పని చేస్తూ వారి స్వలాభం కోసం ఆస్తులు కూడబెట్టుకోవడం కోసం రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండోసారి అధికారంలో వచ్చిన తర్వాత పూర్తిగా విద్య రంగాన్ని విస్మరించారన్నఆరు. విద్యార్థుల కనీస సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందారన్నారు. అల్పాహారం పెట్టమని విద్యార్థుల తల్లిదండ్రులు కొరలేదని, నాణ్యమైన విద్యతో పాటు తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధిని కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డార్విన్ సిద్ధాంతాన్ని, భగత్ సింగ్ జీవిత చరిత్రను తీసేసి, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. రూ.5177 వేల కోట్ల స్కాలర్షిప్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నూనత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా ఆకాష్, భీంరావులను ఏకగ్రీవంగా ఎన్నుకొని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి దిగిడే ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు మోహర్లే రామచందర్, పాల్గొన్నారు.

ఘనంగా కృషి మహోత్సవ్

నవతెలంగాణ-పెంబి



కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నీతి ఆయోగ్ చేపట్టిన ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి పెంబి మండలం ఎంపిక అవ్వడం హర్షనీయమని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సుమారు 150 మంది రైతులు, 7 వ్యవసాయ అనుబంధ ప్రభుత్వ శాఖలు, వివిధ ప్రయివేటు కంపెనీలు, ఎన్జీఓల భాగస్వామ్యంతో కృషి మహోత్సవంలో భాగంగా ఘనంగా అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుజాత మాట్లాడుతూ వ్యవసాయరంగానికి సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖా పరమైన కార్యక్రమాలు అన్నీ కూడా ప్రగతి పథంలో అమలురుస్తున్నామని తెలిపారు. స్థానికంగా పనిచేస్తున్న అధికారులు సహచర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని పనులను సకాలంలో పూర్తి చేస్తున్నారని తెలిపారు. అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా రానున్న రెండు సంవత్సరాల కాలంలో మండల పరిధిలో మిశ్రమ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ రంగాలైన డెయిరీ, పౌల్ట్రీ, తేనె టీగలు, పట్టుపురుగుల పెంపకం చేపట్టడం, జామ, మామిడి, ఆయిల్ పామ్ వంటి బహు వార్షిక పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టి రైతులను ఆర్థికంగా అభివృద్ధి దిశలో నడిపించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మ సేద్య పరికరాల సహాయంతో మండల పరిధిలో సాగు నీటిపారుదల సామర్థ్యాన్ని పెంచేలాగా యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ పేపర్ మిల్లు వారి ఆర్థిక సహకారంతో మండల పరిధిలోని సుమారు 100 మంది రైతులకు ఉచిత భూసార పరీక్షలు చేయించగా వాటి పరీక్ష ఫలితాల కార్డులను అధికారులు రైతులకు పంపిణి చేశారు. ప్రదర్శనలో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, సీఆర్‌డీ ఫౌండేషన్, ఇఫ్కో, నెటా ఫెమ్ డ్రిప్స్, వెటర్నరీ, సెరికల్చర్, మన అగ్రిటేక్, ఆయిల్ పామ్ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీలు రామారావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ టికాజీ, కోఆర్డినేటర్ శంకర్, ఎంపీడీఓ సుధాకర్, ఏఓ ఆసం రవి, ఉద్యాన అధికారి మౌనిక, వెటర్నరీ వైద్యుడు విజయ్, ఏపీఎం గంగారెడ్డి, ఎస్‌పీఎం అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, సుందర రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

అల్పాహార పథకంతో విద్యార్థులు మరింత సౌలభ్యం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థుల కోసం ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా విద్యార్థులకు సకాలంలో అల్పాహారం అందించి పాఠశాలలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించడం జరుగుతుందని, దీనితో మరింత సౌలభ్యం కలుగుతుందని జెడ్పీ చెర్మర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహార పథకాన్ని అందించడం జరుగుతుందన్నారు. పోషకాహార లోపాన్ని నియంత్రించడంతో పాటు తరగతి గదిలో ఏకాగ్రత పెంపొందించవచ్చన్నారు. హాజరు పెరగడంతో పాటు డ్రాప్ అవుట్ తగ్గుతారన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం అల్పాహారం



విద్యా నైపుణ్యాలతో ఉత్తీర్ణత శాతం పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుండగా అల్పాహారం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత సౌలభ్యం కలుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు తీసుకురావడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో డీఈఓ పి.అశోక్, జెడ్పీఈసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిన్ అహ్మద్, ప్రభుత్వ పరీక్షల సహాయ అధికారి మర్యాల ఉదయబాబు, ఎంపీడీఓ శశికళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-కుభీర్

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, స్పోర్ట్ కిట్స్, బతకమ్మ చీరలను పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మండలంలో మొత్తం 108 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.1లక్ష 116 అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలోని 2550 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశామని అన్నారు. అదే విధంగా మండలంలో18, 878 మంది మహిళలకు బతకమ్మ చీరలను పంపిణీ చేశారు. దీంతో నియోజకవర్గంలో 1లక్ష 25వేళా చీరలను పంపిణీ చేశామని అన్నారు. మండలంలో ఉన్న అయా గ్రామాలో ఉన్న పాఠశాల విద్యార్థులకు, యువకులకు ప్రతి ఒక్క పాఠశాలకు రూ.1లక్ష 50వేలతో స్పోర్ట్ కీట్స్‌ను అందజేశామని అన్నారు. కుప్టి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కొరకు రూ.10లక్షల 50 వేలు నిధులు మంజూరు చేశామన్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలో కేటీఆర్ సమావేశంలో ప్రతి మండలానికి రూ.20లక్షలు ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని అన్నారు. వాటిని త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అల్కతాయి సంజయ్, వ్యవసాయ సహకార సంఘం రాష్ట్ర డైరెక్టర్ పీఏసీఎస్ చైర్మెన్ గంగాచరణ్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంతోష్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, తహసీల్దార్ ముంజం సోము, ఎంపీడీఓ లింబాద్రి, మండల నాయకులు, అధికారులు, కల్యాణలక్ష్మీ లబ్ధిదారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.